"నీ కోపం నీ ఆధీనంలోకి రావడం నేను సంతోషించే విషయం. కాని ఓ సారి ఆ గోడని చూడు."

కొడుకు ఆ గోడ వంక చూస్తే పూర్వం సాఫీగా ఉన్న గోడ మీద మేకులు పీకిన రంధ్రాలు కనిపించాయి. తర్వాత తండ్రి చెప్పిన ఈ మాటలు విన్నాడు.

"ఆ గోడ ఎప్పటికీ అలాగే ఉంటుంది తప్ప ఇదివరకటిలా మారదు. అలాగే నువ్వు కోపంతో తిట్టినవారి మనసులు కూడా ఈ గోడలానే గాయపడి ఉంటాయి. ఓ సారి నువ్వు ఓ మనిషి ఛాతీలో కత్తితో పొడిచి, ఆ తర్వాత ఎన్నిసార్లు అతనికి క్షమాపణలు చెప్పినా ఆ గాయం మానదు. భౌతికంగా శరీరానికి కలిగే గాయం ఎలాంటిదో, ద్వేషం ద్వారా మనం ఇతరుల మనసుల్లో కలిగించే గాయాలు కూడా అలాంటివే సుమా!"

## 36. పలకరింపు

ఓ ఆశ్రమాన్ని సందర్శించిన ఓ సందర్శకుడు తన బూట్లని విప్పకుండా ప్రవచనం చెప్పే చోటికి వెళ్ళి కూర్చున్నాడు. ఓ వాలంటీర్ అతని దగ్గరకి వచ్చి చెప్పాడు.

"ఓం నమశ్శివాయ! ఇక్కడ బూట్లని ధరించకూడదు. బయట వదలండి."

సరే అన్నట్లుగా అతను తల వూపాడు కాని కదల్లేదు. కొద్ది నిముషాల తర్వాత స్వామి వారి శిష్యుడు వచ్చి అతనితో చెప్పాడు.

"ఓం నమశ్శివాయ! మీరిక్కడ బూట్లని ధరించకూడదు. బయట ఈ సంగతి బోర్డు కూడా పెట్టాం. వెళ్ళి విప్పి రండి."

అతను నవ్వుతూ తలవూపాడు కాని లేచి వెళ్ళలేదు.

కొద్ది సేపటికి స్వామి ప్రధాన శిష్యుడు వచ్చి అతనితో చెప్పాడు.

"ఓం నమశ్శివాయ! మీరిక్కడికి స్వామి వారి ప్రవచనం వినడానికి రావడం నాకెంతో సంతోషంగా వుంది. దయచేసి బూట్లని బయట విప్పి వస్తారా?"

"తప్పకుండా. కాని నేను ఇక్కడికి చాలా నెలలుగా వస్తున్నాను. ఇంతదాకా మీ ఆశ్రమంలోని ఒక్క మనిషి కూడా నన్ను పలకరించ లేదు. కనీసం పలకరింపుగా

నవ్వనైనా లేదు. ఇప్పుడు బూట్లు వేసుకుని వస్తే వాలంటీర్, స్వామి శిష్యుడు, ప్రధాన శిష్యుడు కూడా వచ్చి పలకరించారు."

చెప్పి అతను లేచి వెళ్ళి బూట్లు విప్పి వచ్చి మళ్ళీ కూర్చున్నాడు.

పవిత్ర నదిలో ఎలా స్వచ్ఛమైన నీటి అడుగున అశుద్ధమైన బురద ఉంటుందో, అలా మహాత్ముల సన్నిధిలో నివశించేవారిలో ప్రేమరాహిత్యం గలవారూ ఉంటారు. ఎదుటివారు తప్పు చేస్తేనే వారు మాట్లాడతారు.

## 37. పూజ

దైవ భక్తి గల ఓ సామాన్యుడు ఓ మహాత్ముడు చెప్పే ప్రవచనాన్ని శ్రద్ధగా వింటున్నాడు. మధ్యలో ఆయన ఇలా చెప్పాడు.

"...కాబట్టి స్తోత్రాలు, కీర్తనలతో కాలక్షేపం చేసే కన్నా మనం మన పనిని నిర్లక్ష్యం చెయ్యకపోవడం వల్ల దేవుడి అనుగ్రహానికి పాత్రులమవుతాం. మన పనిని మనం శ్రద్ధగా చెయ్యడం నిజమైన పూజ. తర్వాతే స్తోత్రాలు, కీర్తనలు."

ఆ ప్రవచనం పూర్తయ్యాక ఆ సామాన్యుడు లేచి ఆ మహాత్ముడి దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"స్వామి! ఇందాక మీరు చెప్పిందాంట్లో నాకు ఒకటి బోధ పడలేదు. దేవుడ్ని స్తుతించడం కన్నా ఎవరి పనిని వారు చేయడం గొప్ప పూజ అన్నారు. కాని కలికాలంలో ఒక్క నామస్మరణ చాలని విన్నాను. ఈ రెంటిలో దేన్ని నమ్మమంటారు?"

"సరే. ఈ సాయంత్రం నాతో వ్యాహ్యాళికి రా. అక్కడ నీ సందేహాన్ని తీరుస్తాను." ఆ మహాత్ముడు చిరునవ్వుతో చెప్పాడు.

సాయంత్రం ఆ మహాత్ముడు వ్యాహ్యాళికి వెళ్ళే సమయంలో అతను ఆయన దగ్గరకి వెళ్ళాడు. ఇద్దరూ ఆశ్రమ తోటలో నడవసాగారు.

ఆ తోటని చూసుకునే ఇద్దరు తోటమాలుల్లో ఒకడు దూరంగా చెట్ల పాదుల్లో రాలిన ఆకులని ఏరేసి చుట్టూ మట్టి కట్ట కడుతూ కనిపించాడు. అతను దూరం నించే ఆ మహాత్ముడికి ఓ నమస్కారం చేసి మళ్ళీ తన పనిని తను